# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- గ్రామాలకు చేరుకున్న సామగ్రి
- అన్ని ఏర్పాట్లు పూర్తి

ముథోల్, నవంబర్ 29 : మండల కేంద్రం ముథోల్ సాంఘిక సంక్షేమ కళాశాలలో బుధవారం పోలింగ్ సామగ్రిని పీవో, ఏపీవోలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు 12 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 374 మంది పీవో, ఏపీవోలతో పాటు 748 మంది అదనంగా ఉంచామని పేర్కొన్నారు. 31 సెక్టార్లకు గానూ 31 మంది రూట్ ఆఫీసర్లను కేటాయించినట్లు తెలిపారు. అలాగే 800 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వారికి ఈవీఎంలు, తదితర సామగ్రిని అందజేసి వారి వారి రూట్లను కేటాయించి పంపారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.



ముథోల్ : పోలింగ్ ఏర్పాట్లపై ఆర్డీవోతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్

**సోన్‌లో..**

సోన్, నవంబర్ 29 : నిర్మల్, సోన్ మండలాల్లోని ఆయా గ్రామాలకు పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రం చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ సిబ్బంది చేరుకొని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**సారంగాపూర్‌లో..**

సారంగాపూర్, నవంబర్ 29 : మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగే పోలింగ్ కోసం సిబ్బంది ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసినట్లు తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలో 54 పోలింగ్ కేంద్రాలకు 324 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని 16 పోలింగ్ కేంద్రాన్ని మాడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశామ న్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు.

**కడెంలో..**

కడెం, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 36 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, ఒక్కో బూత్‌కు 8 మంది అధికార సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. 28,276 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వారు తెలిపారు.

**దస్తురాబాద్‌లో..**

దస్తురాబాద్, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అంతా సిద్ధం చేశారు. కాగా పోలింగ్ కేంద్రాలను విద్యుత్ శాఖ ఏడీఏ కెశెట్టి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాను పరిశీలించారు. 20 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేశామని అధికారులు తెలిపారు.


ఖానాపూర్‌టౌన్ : అరటి కొమ్మలతో సుందరంగా తీర్చిదిద్దిన పోలింగ్ కేంద్రం

**ఖానాపూర్‌లో..**

ఖానాపూర్ టౌన్, నవంబర్ 29 : ఖానాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మున్సిపల్ అధికారులు సుందరంగా అలంకరించారు. వృద్ధులు, దివ్యాంగులు బూత్‌ల వద్దకు తీసుకెళ్లేందుకు వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. ఓటర్లను ఆకట్టుకునేలా పోలింగ్ కేంద్రాల ప్రవేశ ద్వారం బెలున్లతో శుభకార్యాలు జరిగే వేదికగా అలంకరించారు. ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అభినయ్ పాల్గొన్నారు.


ముథోల్ : పోలింగ్ విధులకు హాజరైన పీవో, ఏపీవో, పోలీసు సిబ్బంది

# అభివృద్ధికి ఐకాన్ ముథోల్

## మూడోసారి ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా

- ఇప్పటికే అభివృద్ధి ఎంతో చేశా..
- సరికొత్తగా సమీకృత మార్కెట్
- మిరుమిట్లు గొలుపుతున్న భైంసా సెంట్రల్ లైటింగ్
- విశాలంగా రహదారులు
- ఆహ్లాదాన్ని పంచేలా పార్కులు, ఫౌంటేన్లు
- బాసర ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు
- ట్రిపుల్ ఐటీకి రూ. 25 కోట్లు
- ముథోల్ బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్ రెడ్డి


భైంసాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు

భైంసా, నవంబర్ 29 : మూడో సారి ప్రజలు ఆశీర్వదిస్తే ముథోల్ నియోజకవర్గ రూపు రేఖలు మారుస్తానని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఆయన 'నమస్తే'తో ముచ్చటించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

■ గత ప్రభుత్వాల పాలనలో కుంటుపడిన గ్రామాలు, పట్టణాలు స్వరాష్ట్రంలో అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వసతులు మెరుగుపడ్డాయి.

■ అభివృద్ధికి ఐకాన్‌గా నిలిచింది ముథోల్ నియోజకవర్గం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో దీని రూపురేఖలు పూర్తిగా మార్చివేశాను. భైంసా అభివృద్ధిని చూసి స్వయంగా పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. హరిత హారం అంటే భైంసాలాగా ఉండాలని అంతే కాకుండా శ్మశాన వాటిక నిర్మించి భైంసాలో బాగుందని సాక్షాత్తు అసెంబ్లీలో ప్రస్తావించారు. పట్టణంలో సమీకృత మార్కెట్, అంతర్గత వీధు లు, సెంట్రల్ లైటింగ్, విద్యుత్ కాంతులు అబ్బుర పరుస్తున్నాయి. ఫౌంటేన్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మిషన్‌భగీరథ ట్యాంకులు, క్రీడా మైదానాలు, ఇంటింటికీ శుద్ధజల సరఫరా వంటివన్నీ ముథోల్ నియోజకవర్గ అభివృద్ధిలో ప్రత్యేకంగా నిలిచాయి. ఇక సంక్షేమ పథకాల అమలులో ముథోల్ నియోజకవర్గం అగ్రభాగాన నిలిచింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర వంటివి ఎన్నో అందించాం.

**పదేళ్లలో చేసిన అభివృద్ధి**

■ పంచగుడి బ్రిడ్జికి రూ. 100 కోట్లు

■ బాసర ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు. ఇప్పటికే రూ. 42 కోట్లతో అమ్మ వారి గర్భగుడిని శృంగేరి పీఠాధిపతి శంకరాచార్య, గ్రామస్తుల అనుమతితో పునర్నిర్మాణం చేశాం.

■ ముథోల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలతో పాటు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి రూ. 300ల కోట్లు వెచ్చించాం.

■ నియోజకవర్గంలో 2400 డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేశాం. భైంసాలో 640, మిగితావి మండలాల్లో ఇప్పటికే 1500ల డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తయ్యాయి.


పంచగుడి బ్రిడ్జి

■ బాసర ట్రిపుల్ ఐటీ అభివృద్ధి కోసం రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేశాం.

■ దళిత బస్తీ కింద 800 ఎకరాల భూమి పంపిణీ చేశాం.

■ గుండేగాం పునరావాసానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ. 90 కోట్లు మంజూరు.

■ 132 కేవీ లైన్ల సబ్‌స్టేషన్లు, రైతు వేదికలు, తదితర వంటివి మంజూరు చేశాం.

■ లోకేశ్వరం మండలం, ముథోల్ మండలంలో ఎస్సారెస్పీ కింద ముంపుకు గురైన గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ కింద రూ. 15 కోట్లతో బాసర లిఫ్ట్ పనులు

■ ఇరిగేషన్‌కు రూ. 3 కోట్లతో మరమ్మతులు జరిగాయి.

■ గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు లైన్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశాం.

■ మన ఊరు మన బడిలో భాగంగా సుమారు రూ. 65 కోట్లతో ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ఉర్దూమీడియం తదితర వంటివి పాఠశాలల పునర్నిర్మాణం చేశాం.

■ రూ. 2 కోట్ల 25 లక్షలతో మినీ స్టేడియం. ఆట వస్తువులకు మరో రూ. 5 లక్షలు మంజూరు

■ నూతన ఆస్పత్రి కోసం రూ. 32 కోట్లు.

■ మున్సిపల్ నిధులు కాకుండా భైంసా అభివృద్ధికి రూ. 10 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేయించా.

■ అర్బన్ పార్కుకు రూ. 3 కోట్లు..

■ రూ. 8 కోట్లతో బాసరలో విశ్రాంతి భవనాలు.

■ ముస్లిం మైనార్టీల కోసం సుమారు 16 షాదీఖానాలను నిర్మించాం.

■ ముథోల్‌లోని 30 పడకల ఆస్పత్రికి రూ. 8 కోట్ల నిధులు మంజూరు.

■ నాలుగు సెంటర్లలో పల్లె దవాఖానలు, సబ్ సెంటర్లు, యోగాశాలలు మంజూరు చేయించా.

**అన్నిరంగాల్లో ముథోల్‌ను తీర్చిదిద్దాను..**



రాష్ట్రంలో అభివృద్ధి అంటే ముథోల్ నియోజకవర్గం గుర్తుకు వచ్చేలా అన్ని రంగాల్లో తీర్చిదిద్దాను. మూడో సారి గెలిస్తే మరింత అభివృద్ధి చేస్తా. ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసు కొచ్చేందుకు నిరంతరం కృషి చేస్తా. గుండేగాం ముంపు గ్రామానికి రూ. 90 కోట్లు నిధులు మంజూరు చేయిస్తా. గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలు వల ద్వారా 14 వేల ఎకరాలకు సాగునీరు అందే లా కృషి చేస్తాను. ప్రజల మద్దతు నాకే ఉంది. తప్పకుండా మరో సారి విజయం సాధిస్తా.

**- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్ రెడ్డి**